

మంత్రిని సత్కరిస్తున్న దళిత సంఘాల నాయకులు

# అంబేద్కర్ భవనం చైతన్య వేదిక కావాలి



హాజరైన దళిత సంఘాల నాయకులు

- ఐఏఎస్, ఐపీఎస్‌లను తయారు చేసే కేంద్రంగా మారాలి
- రాష్ట్రంలో అతిపెద్ద అంబేద్కర్ భవనం కరీంనగర్‌లోనే నిర్మాణం
- చింతకుంటలో మంత్రి గంగుల కమలాకర్

కొత్తపల్లి, అక్టోబర్ 7 : గత పాలకులు దళితులను కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూశారని, కానీ, సీఎం కేసీఆర్ దళితబంధును ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి కుటుంబాల్లో వెలుగులు పంచుతున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. ఈ పథకం ద్వారా నేడు ఎంతో మంది పారిశ్రామిక వేత్తలుగా మారి ఇతరులకు ఉపాధి మార్గాలు చూపుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోనే అతిపెద్ద అంబేద్కర్ భవనాన్ని కరీంనగర్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసుకున్నామని, ఈ భవనం దళిత విద్యార్థులకు చైతన్య వేదిక కావాలని, ఐఏఎస్, ఐపీఎస్‌లను తయారు చేసే కేంద్రంగా మారాలని ఆకాంక్షించారు. కొత్తపల్లి మండలం చింతకుంటలో ₹8 కోట్లతో నిర్మించిన అంబేద్కర్ భవనాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. దళిత బంధు పథకంతో రాష్ట్రంలోని వేలాది మంది దళిత కుటుంబాలు ఆర్థికంగా ఎదిగాయని, ఇది సీఎం కేసీఆర్ వల్లే సాధ్యమైందని స్పష్టం చేశారు. అంబేద్కర్‌ను ఏ కులానికి, మతానికి పరిమితం చేయవద్దని, ఆయన ప్రపంచం గర్వించదగిన మేధావి అన్నారు. కరీంనగర్‌లో అత్యాధునిక సౌకర్యాలతో అంబేద్కర్ భవనాన్ని నిర్మించాలని సీఎం కేసీఆర్‌కు విన్నవించగా, అప్పటికప్పుడే స్పందించి ఒక ఎకరం స్థలం మంజూరు చేయడంతోపాటు భవన నిర్మాణానికి ₹8 కోట్లు కేటాయించడం దళితులపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. మేధావులు, దళితుల్లో అన్ని సంఘాలు కలిసి ఒక కమిటీని ఏర్పాటు చేసుకొని నిర్వహణ చేయాలని సూచించారు. అలాగే, నిర్వహణ కోసం షెట్టర్ల నిర్మిస్తామని, ముందు భాగంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. అంబేద్కర్ భవన్ సమీపంలో నిర్మాణంలో ఉన్న ముస్లిం కమ్యూనిటీ సెంటర్‌ను పరిశీలించి అన్ని హంగులతో నిర్మాణం జరుగాలని కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. క్రిస్టియన్ల భవన నిర్మాణం కోసం కొత్తపల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో భూమిని కేటాయించినట్లు చెప్పారు. మేయర్ వై సునీల్‌రావు మాట్లాడుతూ మంత్రి గంగుల కమలాకర్ దూరదృష్టితో ఆలోచించి నిర్మించిన అంబేద్కర్ భవనం రాష్ట్రంలోనే గొప్పగా ఉండటం సంతోషంగా ఉందన్నారు. దళితుల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి ఈ భవనం వేదికగా మారాలన్నారు. ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు మేడి మహేశ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి శ్రీలత మహేశ్‌గౌడ్, జడ్పీటీసీ పిట్టల కరుణ, భూక్య తిరుపతినాయక్, దళిత సంఘాల నాయకులు, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

### రుణపడి ఉంటాం



కరీంనగర్‌లో అంబేద్కర్ భవనాన్ని రాష్ట్రంలోనే గొప్పగా నిర్మించి ఇచ్చినందుకు తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్, మంత్రి గంగుల కమలాకర్‌కు దళితులమంతా రుణపడి ఉంటాం. దళితుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన దళిత బంధు పథకంతో వేలాది కుటుంబాల్లో వెలుగులు నిండాయి. గత పాలకులు, ప్రభుత్వాలు దళితుల గురించిన ఆలోచించిన సందర్భాలు ఎప్పుడూ లేవు. దళితులకు ఎల్లప్పుడూ అండగా ఉంటున్న మంత్రి గంగులకు నాలుగోసారి భారీ విజయాన్ని అందించి కానుకగా ఇస్తాం.

**- మేడి మహేశ్, ఆలిండియా అంబేద్కర్ సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు**

### దళితులుగా గర్వించే రోజు



కార్పొరేట్ కార్యాలయాన్ని తలదన్నే విధంగా అంబేద్కర్ భవనం రూపుదిద్దుకోవడం దళితులంతా గర్వించే రోజు ఇది. మంత్రి గంగుల కమలాకర్ ప్రత్యేక చొరవ చూపడం ద్వారానే 30 ఏళ్ల నాటి అంబేద్కర్ భవన నిర్మాణానికి ఇప్పుడు మోక్షం కలిగింది. తెలంగాణ ప్రభుత్వ హయాంలోనే దళితులు సంతోషంగా ఉన్నారు. అన్ని వర్గాలను సమన్యాయంగా చూసే తెలంగాణ ప్రభుత్వానికి దళితులమతా రుణపడి ఉంటాం. రాబోయే రోజుల్లో అంబేద్కర్ భవనంను చైతన్య కేంద్రంగా మారుస్తాం.

**- అర్ష మల్లేశం, బీఆర్ఎస్ నాయకుడు**

# గడపగడపకూ వెళ్లా.. ఆశీర్వాదం తీసుకున్నా







- అభివృద్ధిని ప్రజలు గుర్తించారు..
- అందుకే బ్రహ్మరథం పట్టారు
- ఇక కాంగ్రెస్ ఆటలు సాగవు
- మంథని గడ్డపై గులాబీ జెండా ఎగురవేస్తాం
- 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో మంథని బీఆర్ఎస్ అభ్యర్థి, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

పెద్దపల్లి, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): '70 ఏండ్ల పాలనలో కాంగ్రెస్ చేసిందేమీ లేదు. కానీ, గడిచిన తొమ్మిదేళ్ల సీఎం కేసీఆర్ పాలనలో అభివృద్ధి పరుగులు పెట్టింది. మళ్లీ కారును గెలిపిస్తేనే రాష్ట్రంలో, మంథనిలో మరింత అభివృద్ధి సాధ్యమవుతుంది. దీనిని ప్రజలు గుర్తించారు. అందుకే నా ప్రజా ఆశీర్వాద యాత్రకు బ్రహ్మరథం పట్టారు. ఎక్కడికి వెళ్లినా ఆశీర్వాదం తెలిపారు' అని మంథని బీఆర్ఎస్ అభ్యర్థి, జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ చెప్పారు. ఆయన ప్రజా ఆశీర్వాద యాత్ర గురువారం ముగిసిన సందర్భంగా 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. కాంగ్రెస్ కుట్రలను ఎండగడుతూనే.. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని వివరించారు. గత నెల 25న ముత్తారంలో యాత్ర చేపట్టానని, ప్రజల ఆదరాభిమానాలతో అడుగులో అడుగు వేసుకుంటూ తెలియకుండానే 11 రోజులపాటు పాదయాత్ర చేశానని చెప్పారు. తొమ్మిది మండలాల్లోని 97 గ్రామాల్లో ప్రతి గడపనూ తడుతూ.. 311 కిలోమీటర్లు నడిచి, గురువారం ముగించానన్నారు. ఆరోగ్యం సహకరించకున్నా.. అస్వస్థతకు గురైనా అడుగడుగునా ప్రజల ప్రేమాభిమానాలే నన్ను పల్లెపల్లెకూ, గడపగడపకూ నడిపించాయన్నారు.

**నమస్తే తెలంగాణ : మీ ప్రజా ఆశీర్వాదయాత్ర ఎలా సాగింది?**

పుట్ట మధూకర్: నేను అధికారంలో ఉన్నా లేకున్నా నిత్యం ప్రజల మధ్యే ఉన్నా. నాకు పదవులు ప్రధానం కాదు, ప్రజలే ప్రధానం. వాళ్ల ఆశీర్వాదం తీసుకోవాలనుకున్నా. అందుకే నేను ప్రజా ఆశీర్వాద యాత్రకు శ్రీకారం చుట్టా. గత నెల 25న ముత్తారం మండల కేంద్రం నుంచి ప్రారంభించాం. మల్హర్, కాటారం, మహాముత్తారం, పలిమెల, మహాదేవపూర్, కాటారం, మంథని, రామగిరి, కమాన్‌పూర్, రామగిరి మండలాల్లోని 97 గ్రామాల్లో ప్రతి గడపకూ వెళ్లా. మొత్తం తొమ్మిది మండలాల్లో 311 కిలోమీటర్లు నడిచా. గురువారం మంథనిలో యాత్రను ముగించా.

**నమస్తే : ప్రజా స్పందన ఎలా ఉన్నది?**

పుట్ట మధూకర్: నేను బీఆర్ఎస్ అభ్యర్థిని కావడమే నా అదృష్టం. పార్టీ ఇచ్చిన అవకాశంతోనే ప్రజలు నన్ను సొంత బిడ్డలా ఆదరించారు. రాష్ట్రం లో, మంథనిలో కారును గెలిపిస్తేనే మరింత అభివృద్ధి సాధ్యం అనే విషయాన్ని గుర్తించారు. అందుకే నా యాత్రకు ఆశీర్వాదం తెలిపారు. అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. నా ఆరోగ్యం సహకరించకపోయినా.. అస్వస్థతకు గురైనా.. ప్రజల ప్రేమాభిమానాలతోనే పల్లెపల్లెకూ వెళ్లా. గడపగడపనూ తట్టా.

**నమస్తే : ప్రతిపక్ష పార్టీల తీరు ఎలా ఉన్నది?**

పుట్ట మధూకర్: మంథని నియోజకవర్గంలో ప్రతిపక్షాల తీరు విచిత్రంగా ఉన్నది. మంచిని స్వీకరించే పరిస్థితుల్లో ఆ పార్టీలు లేవు. ప్రతి విషయంలో బట్టకాల్చి మీద వేయడమే పనిగా పెట్టుకున్నాయి. అంతే తప్ప ప్రజా సమస్యలను పట్టించుకోవు. కాంగ్రెస్ అయితే మరి మోసకారిగా తయారైంది. ఇక్కడి కాంగ్రెస్ ఎమ్మెల్యే ఇక్కడ ఉండడు. ఆయనకు పదవులు కావాలే తప్ప ప్రజా సేవ అవసరం లేదు. హైదరాబాద్‌లో ఉండి రాజకీయాలు నడిపించుడే తప్ప ఒక్క పని చేయడు. ఒక బీసీ బిడ్డగా ఎదిగిన నన్ను రాజకీయంగా ఎలా సమాధి చేయాలనే లక్ష్యంతో కొంత మందికి నెల నెలా జీతాలు ఇచ్చి మరీ ప్రోత్సహిస్తున్నాడు. నిరంతరం కుట్రలు, కుతంత్రాలతో నన్ను నా కుటుంబాన్ని మానసికంగా హింసిస్తూనే ఉన్నాడు.

**నమస్తే: మీ ధీమా ఎలా ఉన్నది?**

పుట్ట మధూకర్: మంథని నియోజకవర్గంలో ఇప్పటి వరకు పదకొండు సార్లు ఎన్నికలు జరిగాయి. పది సార్లు కాంగ్రెస్ నుంచి ఒకే ఒక్క సామాజిక వర్గానికి, ఎనిమిది సార్లు ఒకే కుటుంబానికి టికెట్లు దక్కాయి. వారే ఈ మంథని నియోజకవర్గాన్ని ఎక్కువకాలం పాలించారు. కానీ, ఇక్కడ చేసిందేమీ లేదు. అదే 2014లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా నాకు ప్రజలు అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత 2019లో ఓటమి పాలైనా సీఎం కేసీఆర్ జడ్పీ చైర్మన్‌గా అవకాశం ఇచ్చారు. ఈ తొమ్మిదిన్నర ఏండ్లల్లో ఎంతో అభివృద్ధి చేశాం. ఇది మంథని నియోజకవర్గం ఏర్పాటు తర్వాత జరిగిన అభివృద్ధితో పోలిస్తే నూరు రెట్లు ఎక్కువ. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించారు. అభివృద్ధికి ఈ ఎన్నికల్లో తప్పక పట్టం కడుతారు.

**నమస్తే: మీరు ఎమ్మెల్యేగా గెలిస్తే ఎలాంటి సేవలందిస్తారు?**

పుట్ట మధూకర్ : నేను ఇక్కడే పుట్టా. ఇక్కడే పెరిగా. చివరి వరకూ ఇక్కడే ఉంటా. నా జీవం.. నా ప్రాణం ఇక్కడి ప్రజలతోనే. మంథని నియోజకవర్గ ప్రజలతో నాకున్నది ఓటు సంబంధం కాదు, పేగు బంధం. రక్త సంబంధం. ఎన్నికలు, ఓట్లతో సంబంధం లేకుండా అందుబాటులో ఉంటా. వారి కష్టాలు, కన్నీళ్లల్లో భాగమవుతా. ప్రతీ పేద కుటుంబానికి ఇళ్లు ఉండాలనేది సీఎం కేసీఆర్ సంకల్పం. అది నెరవేర్చడానికి ఏడాదికి పది వేల ఇండ్లు కట్టించే విధంగా నేను పని చేస్తా. గృహలక్ష్మి కింద ఇండ్లు కట్టుకునే వారికి సాయం అందిస్తా. గృహ ప్రవేశానికి నేను నా భార్య వెళ్లి బట్టలు పెట్టి వస్తా. ఇక్కడి పేద కుటుంబాల బిడ్డలకు ఉన్నత చదవులు భారమవుతున్నాయి. అలాంటి వారి కోసం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా హాస్టళ్లు పెట్టి, నా సొంత ఖర్చులతో వారికి వసతి కల్పిస్తా. విదేశాలకు వెళ్లే పేద బిడ్డలకు నేనే షూరిటీ ఇచ్చి, పంపిస్తా. ఇప్పటికే 12మందిని విదేశాలకు పంపించా.

**నమస్తే : మంథని నియోజకవర్గ ప్రజలకు ఏం చెబుతారు?**

పుట్ట మధూకర్: 70 ఏండ్ల కాంగ్రెస్ చీకటి పాలన ఒకవైపు, తొమ్మిదిన్నరేండ్ల అభివృద్ధి, సంక్షేమ పాలన మరో వైపు ఉన్నది. ప్రజలు మోసపూరిత మాటలను నమ్మకుండా వివేకంతో వ్యవహరించాలి. మీరు ఒక్క రోజు నాకు కేటాయించి ఓటేయ్యండి. ఐదేండ్లు నేను, నా కుటుంబం మీకు సేవ చేసుకునే భాగ్యం కల్పించండి. గెలిచిన తర్వాత హైదరాబాద్‌లో ఉండే అప్ అండ్ డౌన్ ఎమ్మెల్యేను కాదు. నిత్యం మీతోనే ఉండే మీ అన్నను, తమ్ముడిని. నేను పాలకుడిని కాదు, మీ సేవకుడిని. బీఆర్ఎస్‌కు ఓటేయండి. అభివృద్ధికి పట్టం కట్టండి. ఎమ్మెల్యేగా నాకు మరోసారి అవకాశం ఇవ్వండి. మూడోసారి కేసీఆర్‌ను సీఎం చేయండి.

# బీఆర్ఎస్‌తోనే సంక్షేమం

- ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

ఓదెల, అక్టోబర్ 7: రాష్ట్రంలో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తేనే పేద ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు వస్తాయని పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కనగర్తి గ్రామంలో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులు, డప్పుచప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. అనంతరం మాట్లాడారు. కేసీఆర్ సీఎం అయిన తర్వాతనే తెలంగాణ ప్రజలకు భరోసా దొరికిందని, దేశంలో ఎక్కడా లేని పథకాలతో మన రాష్ట్రం ఆదర్శంగా కొనసాగుతున్నదని చెప్పారు. పల్లెలు, పట్టణాలు ప్రజలు ఆశించిన విధంగా అభివృద్ధి చెందాయన్నారు. కాంగ్రెస్ హామీలను ప్రజలు నమ్మి మోసపోవద్దని, గతంలో ఏండ్లకేండ్లు పాలించి ఏం చేసిందో ఒక్కసారి గుర్తుచేసుకోవాలని సూచించారు. పెద్దపల్లి నియోజకవర్గం గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ తొమ్మిదేండ్లలో ఎంతో అభివృద్ధి చెందిందని, మీ కండ్ల ముందే కనిపిస్తున్నదని చెప్పారు. ఇక్కడ బీఆర్ఎస్, ఆర్బీఎస్ మండలాధ్యక్షులు ఐరెడ్డి వెంకటరెడ్డి, కావటి రాజుయాదవ్, ఎంపీటీసీ ఆరెల్లి సరోజన-మొండయ్యగౌడ్, సర్పంచ్ కోట దామోదర్‌రెడ్డి, ఆర్బీఎస్ జిల్లా డైరెక్టర్ కందుల సదాశివ్, ఉపసర్పంచ్ గాండ్ల ఐలయ్య, రావుల స్వామి, తాళ్లపల్లి సదయ్య, మేర్గు మణికంఠ, రాయిల్ల రమేష్, రాజేశం, తోట రవి, కలవేని పోశమల్లు, మద్దికుంట తిరుపతి, పిట్టల సారయ్య, మోతె బుచ్చిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కనగర్తిలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే